# గొలుసు

ఆకాశం మెరుస్తోంది. అంతకన్నా గట్టిగా ఉరుముతోంది వీటికి తోడు చీకటి. ఇవన్నీ చాలవన్నట్టు కరెంటు పోయింది

ఆ నగరంలో ఓ విశాలమైన ఇల్లు. ఆ యింటిలో ఓ గది. గదిలో ఓ మూలగా టేబుల్. టేబుల్ పైన వెలుగుతున్న కేండిల్. టేబుల్ కెదురుగా ఖరీదైన కుర్చీ. కుర్చీలో అంతకన్నా ఖరీదైన మనిషి.

తన ఎడంచేతిలో వున్న సీసాను కుడిచేతిలోకి తీసుకుని, బల్లమీదున్న గ్లాసులో సీసాలోని ద్రవం పోసి, ఆ గ్లాసును చేతిలోకి తీసుకున్నాడతను.

కేండిల్ శక్తివంచన లేకుండా వెలుగుతోంది ఆ వెలుగు గది అంతా సమానంగా కాకపోయినా - ప్రసరిస్తోంది. అన్నట్టు- ఆ గదిలో మరోవైపు స్ప్రింగ్ కాట్ ఉంది. మరో రెండు కుర్చీలున్నాయి. రిఫ్రిజిరేటరు కూడా ఉంది.

బైటంతా మెరుపులతోటి, ఉరుములతోటి వాన కురుస్తోంది. తలుపులన్నీ మూసేసివున్నా చలి పుడుతోంది. గ్లాసులోది కొంచెం తాగాడతను.

కొంచెం మంటగా లోపలికి దిగింది పరమశివుడు కాలకూట విషాన్ని మింగిన సన్నివేశం గుర్తు రాలేదతనికి. ఆమాటకొస్తే అతని కనవసరంగా ఏవీ గుర్తు రావు.

పురుటికెళ్ళిన శకుంతల సరిగ్గా ఇదే సమయానికి తన భర్త ఎంత ఎక్కువగా తాగేస్తున్నాడోనని కలవరపడింది. భర్త గురించి ఆలో

చిస్తే పరవాలేదుగాని, భర్త తాగుడు గురించి ఆలోచిస్తే. అందులో కడుపుతో ఉన్నపుడాలోచిస్తే శేఖరానికి పదిరెట్లు తాగుబోతైన కొడుకు పుడతాడేమోనని భయపడి ఆ ఆలోచన మానుకుంది. లేదు, మానుకున్నాననుకుంది

తెల్లకాగితంమీద పెన్సిలు గీత కాదుకదా, మనసులోని ఆలోచన-చెరిపేస్తే చెరిగిపోవటానికి. ఆ ఆలోచన మానేయటానికి ఆమె ఆంధ్రుల అభిమాన వారపత్రిక చూడసాగింది. అయినా లాభంలేకపోయింది. అభిమాన వారపత్రిక కూడ ఆమెచేత ఆలోచన మాన్పింపలేక పోయింది. ఆమెఅలా ఆలోచిస్తూనే ఉంది......

మనకి శకుంతల విషయం అనవసరం. ఎందుకంటే ఇది శకుంతల కథ కాదు అలాని ఆమె భర్త శేఖరం కథా కాదు మరి? శేఖరం చేసిన ఘనకార్యం కథ.

శేఖరం గ్లాసు ఖాళీ చేశాడు. సిగరెట్టు ముట్టించి, మరో సీసా సీలు ఊడదీసి గ్లాసులోకి కొంచెం పోసుకున్నాడు. తాగుతూ, మధ్య మధ్య ఆగుతూ, సిగరెట్టు కాలుస్తూ- తాగుతున్నాడు.

నిషా ఎక్కుతోంది. మనస్సు ఏదో కావాలంటోంది.

"ఏం కావాలి నీకు?"

"..................."

"మాట్లాడవేం?"

"ఓహ్, అదా!"

కంపెనీ గొడవలు, డబ్బు, కోరిక తీర్చుకోవటానికి ఆడవాళ్ళు— ఈ మూడూ తప్ప ప్రపంచంలో మరేంవున్నాయో శేఖరానికి తెలీదు.

అరోజే అతను క్యాంపునించి తిరిగి వచ్చాడు. ప్రస్తుతం శేఖరానికి కంపెనీ విషయాలు, డబ్బూ అక్కర్లేదు. ఆడది కావాలి.

మరికొంచెం తాగాడు——

మనస్సు మరీ అల్లరిపెడుతోంది.

కళ్ళు బరువెక్కుతున్నాయి.

వళ్ళు తూలుతోంది.

'కనీసం శకుంతల ఊళ్ళో ఉన్నా బావుణ్ణు' అనిపించింది శేఖరానికి. ఇంతలో బైట ఏదో చప్పుడు.

అది ఎవరో కిందపడిన చప్పుడు

'ఎవరో అది? చూస్తేనో!' గొణుక్కున్నాడు శేఖరం.

కొవ్వొత్తినించి మరో కొవ్వొత్తిని వెలిగించి, తలుపుతీసి కొవ్వొత్తి తీసికెళ్ళి చూశాడు. మెట్ల దగ్గిర వయస్సులోవున్న ఓ అమ్మాయి పడిపోయివుంది.

వానచినుకుపడి కొవ్వొత్తి ఆరిపోయింది. వెంటనే హడావిడిగా లోపలికెళ్ళి వానతుంపర పడిన మొహాన్ని తుడుచుకున్నాడు శేఖరం.

కంగారుగా వెళ్ళి ఆమెను తన చేతులపైకి తీసుకుని లోపలికి వస్తుంటే ఆ అమ్మాయి కదిలి – 'ఎవరు?' అంది.

'భయంలేదు' అన్నాడు శేఖరం, బహుశా తను చేయబోయేది ఆ అమ్మాయిని భయపెట్టే పని కావటంవల్లనేమో!

ఆ అమ్మాయిని మంచంమీద పడుకోబెట్టి, తలుపులు మూసి కేండిల్ ఆ అమ్మాయి దగ్గిరకి తీసికెళ్ళి చూశాడు–

ఆ అమ్మాయి అతనికి తెలిసున్న అమ్మాయే. అతని కేమిటి? ఆ పరిసరాల్లో చాలామందకి తెలుసునా అమ్మాయి. కానీ ఆ అమ్మాయికి

'నా' అనేవాళ్ళు ఎవరైనా వున్నారో లేదో ఎవఁకీ తెలియదు. ఆ అమ్మాయి పిచ్చిదనీ, వెర్రిదనీ అందరూ అంటారు. అయితే - ఆ అమ్మాయి ఎవర్నీ బాధించదు. పిచ్చి చూపులు చూస్తూ పోతూం టుంది. ఆకలైతే చెయిజాచి అడుక్కుంటుంది. తిండి తింటుందో, తినదో, ఎక్కడుంటుందో, ఏం చేస్తుందో. ఎవరికీ అవసరం లేదు.

కొవ్వొత్తినించి కాస్త కొవ్వు కారి, ఆ అమ్మాయి బుగ్గమీద పడింది.

"అబ్బా!" అంది అందుకే.

"పరవాలేదు. ఇప్పుడెలావుంది?"

వెర్రిగా చూసింది ఆ అమ్మాయి ఒకసారి.

టేబుల్ దగ్గిరకొచ్చి ఓ సిగరెట్టు వెలిగించుకున్నాడు శేఖరం. బుర్ర చప్పున పనిచేసింది.

''చలిగావుందా?'' అడిగాడు ఆ అమ్మాయిని శేఖరం.

అడిగాడే కాని, ఆ అమ్మాయి - లేదు అనేస్తుందేమోనని భయ పడ్డాడు. అందుకే సమాధానం కోసం ఎదురుచూడకుండా తను తాగే పదార్థాన్ని గ్లాసులో సగానికి పోసి-

'ఈమందు తాగితే చలి పూర్తిగా తగ్గిపోతుంది. తాగు!' అన్నాడు.

ఆ అమ్మాయి వెర్రిచూపులు చూసింది.

'పరవాలేదు తాగు!'

ఆ అమ్మాయి కేంచేయాలో తెలియలేదు. అసలు అంత పెద్దవాళ్ళె వరూ తనతో చనువుగా మాట్లాడరు. ఆ సమయంలో ప్రతీ మగాడూ చనువుగా మాట్లాడతాడని ఆ అమ్మాయికేం తెలుసు? తెలీదు కనుకనే గ్లాసు తీసుకుని, కొంచెం తాగింది. తాగి వెంటనే అంది 'ఛ ఛ!'

"ముందు అలాగే వుంటుంది. మరి చలి తగ్గద్దూ!" ఊపిరి బిగ పట్టి అన్నట్టుగా అన్నాడు శేఖరం. అనటమే కాదు, ఆ అమ్మాయిని జాగ్రత్తగా పట్టుకుని తాగించాడు.

"నీ పేరేమిటి?" అడిగాడు శేఖరం

"గౌరి!" చెప్పింది ఆ అమ్మాయి.

ఆ సమయంలో పేరేదైనా, మనిషెవరైనా బాధలేదు శేఖరానికి. ఆడదైతే చాలు!

ఆమెను గట్టిగా, తప్పించుకోలేనంత గట్టిగా కౌగలించుకున్నాడు శేఖరం.

"ఏమిటిది?" అంది గౌరి.

శేఖరం గౌరికి సమాధానం చెప్పలేదు. మళ్ళీ గౌరిని ప్రశ్న వెయ్యనివ్వలేదు. కొవ్వొత్తి ఆరిపోయింది. సినిమాలలోలాగా కొవ్వొత్తి ఆరిపోయిందని గౌరి చచ్చిపోలేదు.

ముందు గౌరి ప్రతిఘటించింది. తర్వాత ప్రతిఘటించటానికి ప్రయత్నించింది ఆ తర్వాత ప్రతిఘటించలేక, ఆ ప్రయత్నం మానుకుంది.

—శేఖరానికి వేసిన దాహాన్ని ఆరాత్రి గౌరి శరీరం పూర్తిగా తీర్చింది.

పూర్వం యజ్ఞం చేసేటపుడు మేకలను బలియిచ్చేవారు. కానీ జీవహింస పాపమని మానేశారు. ఇది జీవహింస కాదు. జీవహింస కానంత మాత్రాన పాపం కాకపోదు. ఆమాటకొస్తే మహాపాపం. అయినా పాపపుణ్యాలు కేటాయించే దెవరు? పాపం అంటే ఏమిటి? ఆ పాపానికి

పరిహారం ఏమిటి? ఎవరికీ తెలీదు. తెలిసినా అక్కర్లేదు. అందుకే ఆ రాత్రి గౌరి శీలం ఉరితీయబడింది.

సడన్‌గా శేఖరానికి మెలకువ వచ్చింది. పక్కనే గౌరి నిద్రపోతోంది కంగారుగా టైము చూసుకున్నాడు శేఖరం. అయిదయింది. నెమ్మదిగా లేచి, తలుపు తీసి చూశాడు.

వర్షం తగ్గింది కాని, మళ్ళా వచ్చే సూచనలున్నాయి. త్వరగా డ్రెస్ చేసుకుని, నాలుగు జతల బట్టలు సూట్‌కేస్‌లో సర్దుకుని, గౌరిని మెల్లగా చేతులమీద కెత్తుకుని వరండాలో పడుకోబెట్టాడు. సూట్‌కేస్ తీసుకుని, తలుపు తాళంవేసి చురుగ్గా సందు మలుపు తిరిగి, టాక్సీ ఎక్కి 'పోనీయ్!' అన్నాడు.

* * * *

అయిదు కేలండర్లు మారాయి. శేఖరానికి బదిలీకావటం, శకుంతల పండంటి కొడుకు నెత్తుకుని బదిలీ అయిన ఊరు వెళ్ళటం- ఇవే ఈ అయిదేళ్ళలోనూ ఈ కథలో మనం చెప్పుకోదగిన మార్పులు.

అయితే—

ఇప్పుడు మళ్ళా శేఖరం కంపెనీ విషయాలు చూసుకోవటానికి ఈ ఊరు వచ్చాడు.

శేఖరానికి సంజీవరావు కలిశాడు. ఇద్దరి మధ్యా మంచి స్నేహం వుంది. స్నేహం ఎలా అయిందో కాని, శేఖరానికీ సంజీవరావుకీ తూర్పు పడమరలంత తేడావుంది స్వభావాలలో.

ఇద్దరూ హోటలు కెళ్ళారు. ఆ హోటలు పరిసరాల్లో ఓ అమ్మాయి అడుక్కుంటోంది. ఆ అమ్మాయిని తేరిపారచూస్తే పాతికేళ్ళయినా ఉండవు. అయినా ఎన్నో ఏళ్ళు మీదబడినట్టు కనిపిస్తోంది.

లోతుకుపోయిన కళ్ళు, రక్తంలేని వళ్ళు।

జీవంలేని జీవనం, జీవత్వంలేని జీవితం ॥

ఆమె కుడిచేతివేలు పట్టుకుని మరో చిన్నపిల్ల నడుస్తోంది ఆ చిన్నపిల్ల శరీరం బోసిగా వుంది. ఆచ్ఛాదన అస్సలు లేదు. నడవలేక నడుస్తూ అడుక్కుంటున్నా రిద్దరూ.

సంజీవరావు ఇదంతా చూసి-

"శేఖరం, అటు చూడు!" అన్నాడు.

శేఖరం చూశాడు. అతనికి ప్రత్యేకంగా ఏమీ కన్పించలేదు. కనుబొమలెగరేసి, ఏమిటన్నట్టు చూశాడు.

"ఆ అమ్మాయిని చూడు!"

"ఏ అమ్మాయిని?" అడిగాడు శేఖరం, ఎవరో అందమైన అమ్మాయిని చూపెడుతున్నాడేమో సంజీవరావు అని.

"ఆ అమ్మాయిని!" వేలుపెట్టి చూపించాడు సంజీవరావు.

శేఖరం ఆ అమ్మాయికేసి తేరిపార చూసి గతుక్కుమన్నాడు.

ఆమె - గౌరి.

"నేను ఇక్కడే పుట్టాను, పెరిగాను. ఇక్కడే చదువుకుని, ఉద్యోగం చేస్తున్నాను. నాకా అమ్మాయి తెలుసు. పాపం! ఎవరినీ బాధించదు. ఆ అమ్మాయిది తప్పంటే అస్సలు ఒప్పుకోను. అలాటి అమ్మాయిని - ఎవడో రాస్కెల్, ఎంతపని చేశాడో చూడు! ఇప్పుడా తల్లికీ, పిల్లకీ దిక్కెవరు?"

కాఫీ బావున్నా తాగలేకపోతున్నాడు శేఖరం.

రోజూ కాల్చే సిగరెట్టే కాల్చలేకపోతున్నాడు.

సంజీవరావు మాటలు వినలేక, వినక తప్పక వింటున్నాడు మళ్ళీ సంజీవరావే మాట్లాడాడు -

"ఎవడో వాడి కోరిక తీర్చుకునేందుకు ఆ అమ్మాయిని బలి చేశాడు. ఆ అమ్మాయి ఎన్నాళ్ళో బతుకుతుందన్న నమ్మకం లేదు. కూతురు పెద్దదవకుండానే తల్లి చచ్చిపోవచ్చు. అప్పుడు కూతురు గతి?"

"వాళ్ళ గొడవ మనకెందుకులెద్దూ?" శేఖరం ఆ సంభాషణ ఇష్టం లేనట్టుగా అన్నాడు.

కానీ సంజీవరావు వినిపించుకోలేదు-

"ఏడెనిమిదేళ్లొచ్చేసరికి తల్లి కాస్తా చచ్చిపోతే, గతిలేక ఆడుకుంటుందా అమ్మాయి. అలాగే పెరుగుతుంది. యవ్వనం రాగానే తల్లిని పాడుచేసిన ప్రబుద్ధుడిలాటివాడే పిల్లనీ పాడుచేస్తే? ఖర్మకాలి, ఈ పిల్లకీ ఆడపిల్లే వుడితే? అసలీ దారుణానికి అంతం ఎప్పుడు?"

శేఖరం ఇక విన లేక "పద పోదాం!" అంటూ కుర్చీలోంచి లేచాడు.

హోటలు బైటకొచ్చి టాక్సీ పిలిచాడు శేఖరం. టాక్సీ టర్నయి వస్తోంది

అంతదూరంలో ఆడుకుంటున్న గౌరి పిల్లను ఎత్తుకొని, విపరీతంగా నవ్వుతూ, పరిగెత్తుకుంటూ వస్తోంది-

టాక్సీయే ముందొచ్చింది.

ఆశ్చర్యంగా ఆ అమ్మాయికేసి చూస్తూ నిలచున్న సంజీవరావుని బలవంతంగా టాక్సీలోకి నెట్టి—

'వెధవ న్యూసెన్సు!' అనుకుని, పైకి మాత్రం 'పోనియ్!' అన్నాడు శేఖరం.

ఎప్పుడూ మామూలుగా, స్థబ్ధుగా వుండే గౌరి పరిగెడుతూ ఎందు కొచ్చిందో సంజీవరావు కర్థం కాలేదు. శేఖరం ప్రవర్తన అంతకన్నా అర్థంకాలేదు.

అతనికి అర్థం అయినా కాకపోయినా గౌరి లాటి అమ్మాయిల కథ మాత్రం ముగియలేదు.